
సాక్షి
సంగారెడ్డి
గురువారం : 8 : ఫిబ్రవరి : 2024



సిరుల వరి

సింగూరు ప్రాజెక్టు సాగు నీటితో రైతులు సిరులు పండిస్తున్నారు.

వివరాలు 8లో ▸



అతివేగంతోనే ప్రమాదం

అతివేగానికి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో 23 మంది గాయపడగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు.

వివరాలు 8లో ▸



సమష్టి సహకారంతోనే..

సమష్టి సహకారంతోనే పరిశుభ్రత సాధ్యమవుతుందని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య అన్నారు.

వివరాలు 9లో ▸

అసైన్డ్ భూముల్లో దందా!

భూ బకాసురులు పేట్రేగిపోతున్నారు.. అసైన్డ్ భూముల్లో తిష్ట వేస్తున్నారు. ప్లాట్లుగా మార్చి అక్రమార్జనకు తెగబడుతున్నారు. తక్కువ ధరకే ప్లాట్లు అంటూ పేదలను మోసం చేస్తున్నారు. నియోజకవర్గంలో 'రియల్' మోసం జరుగుతున్నా అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో అక్రమార్కులు ముఠాగా ఏర్పడి ఈ దందా కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

- పేట్రేగుతున్న భూ బకాసురులు
- ప్లాట్లుగా మార్చి జోరుగా విక్రయాలు
- పటాన్‌చెరులో 'రియల్' మాయాజాలం
- కళ్లప్పగించి చూస్తున్న అధికార గణం

పటాన్‌చెరు: రియల్ వ్యాపారుల కళ్లు ఇప్పుడు అసైన్డ్ భూములపై పడింది. భూములను అక్రమ మార్గంలో కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా వాటిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. తక్కువ ధరకే ప్లాటు అంటూ మోసాలకు పాల్పడుతున్నారు. నియోజకవర్గంలో ఈ దందా రోజురోజుకు విస్తరిస్తోంది. ఎక్కువగా పేద, మధ్య తరగతి ప్రజలే మోసపోతున్నారు. సంగారెడ్డి మండలంలోని బేగంపేట, హత్నూర మండల కేంద్రంలో, అమీన్‌పూర్ మండల కిష్టారెడ్డిపేట గ్యాస్ గోదాం వెనుక అసైన్డ్ భూములను 'రియల్'ముఠా కొనుగోలు చేసి ప్లాట్లుగా చేసి అమ్ముతున్నారు.

అమీన్‌పూర్‌లో..

అమీన్‌పూర్ మండల పరిధిలో రియల్ వ్యాపారులు అసైన్డ్ భూములను ప్లాట్లు గా చేసి రూ.15లక్షల నుంచి రూ.25 లక్షలకు వంద గజాల చొప్పున విక్రయిస్తున్నారు. పట్టణంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అసైన్డ్ భూములకు పరిసర పట్టా భూముల సర్వే నంబర్లు వేసి ఇళ్లను నిర్మించి అమ్ముకుంటున్నారు. వాటిని దర్జాగా రిజిస్ట్రేషన్ చేసి విక్రయించడం విశేషం. పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేటలోని అసైన్డ్ భూములను సైతం విక్రయిస్తున్నారు.

స్థానిక నేతల అండదండలు

అమీన్‌పూర్ పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను సైతం ప్లాట్లు గా చేసి అమ్ముతుండటం విచిత్రం. విషయం తెలిసి అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు పలుమార్లు వాటిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని, అయినా ఫలితం లేకుండా పోతోంది. అయితే అధికారులు, రాజకీయ నేతల అండదండలతోనే ఈ తంతు సాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సుల్తాన్ పూర్, దాయర గ్రామాలతో పాటు రామచంద్రపురం, జిన్నారం, గుమ్మడిదలలో చాలా వరకు అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. అమీన్ పూర్ పట్టణంలో సర్వే నంబరు 630, 993లో స్వాతంత్ర్య సమరయోధులకు ఇచ్చిన భూములను 70 గజాల చొప్పున ప్లాట్లు గా చేసి రూ.20 లక్షలు చొప్పున విక్రయిస్తున్నారు. పటాన్‌చెరు మండల పరిధిలో ఇంద్రేశంలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు 58, 59 జీవో కింద రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటిని అధికారులు తిరస్కరించారు. దయర లో ఒక వెంచర్ వారు ఏకంగా రోడ్డు వేసుకున్నారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఆ రోడ్డును తవ్వినా ప్లాట్ల విక్రయాలు మాత్రం ఆగడంలేదు.



అసైన్ భూమిలో ఒక నేత ఆఫీస్



అమీన్‌పూర్ దంప్‌యార్డ్ సమీపంలో వెలిసిన ఇళ్లు

చర్యలు తీసుకుంటాం



అసైన్డ్ భూములను కాజేసే వారిపై చర్యలు తీసుకుంటాం. భూములు కొనుగోలు చేసే వారు తక్కువ రేట్ కే వస్తుంది అని మోసపోవద్దు. అసైన్డ్ భూముల క్రయ విక్రయాల చట్ట విరుద్ధం. చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తాం.

– రవీందర్ రెడ్డి, ఆర్డీఓ, సంగారెడ్డి

పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం

పల్లెల్లో పచ్చదనం
పరిఢవిల్లాలి: కలెక్టర్ క్రాంతి

కొండాపూర్ (సంగారెడ్డి): పారిశుద్ధ్యం బాగుంటేనే ప్రజలు బాగుంటారని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా బుధవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో కలెక్టర్ మాట్లాడారు. పారిశుద్ధ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. వారం రోజుల పాటు పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. పల్లెలు పరిశుభ్రం, పచ్చదనంతో ఉండాలని, చెట్లను పరిరక్షించుకోవాలని కోరారు. వేసవిలో నీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతినెల 1, 11, 21వ తేదీలలో నీటి ట్యాంకులు శుభ్రం చేసుకోవాలని, అందరి భాగస్వామ్యంతోనే పారిశుద్ధ్య నిర్వహణ బాగుపడుతుందని చెప్పారు. ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం గ్రామంలో మురికి కాలువలను పరిశీలించారు. రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న బావిని పూడ్చాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ రెడ్డి



కొండాపూర్ మండలం తొగర్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

ఆకస్మిక తనిఖీ

కొండాపూర్ మండలం గిర్మాపూర్‌లోని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలనుకలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యాబోధనపై ఏం చర్యలు తీసుకున్నారని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. పల్ ను ఆరాతీశారు. లైబ్రరీని పరిశీలించారు. బాగా చదువుకోవాలని విద్యార్థులను ఉద్బోధించారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. కలెక్టర్ వెంట కొండాపూర్ ఎంపీపీ మనోజ్ రెడ్డి, డీఎల్పీవో సతీష్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

యువత భాగస్వాములు కావాలి

సదాశివపేట రూరల్: ఈనెల 15 వరకు కొనసాగనున్న పారిశుద్ధ్య వారోత్సవాలలో యువత భాగస్వాములు కావాలని కలెక్టర్ క్రాంతి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పంచాయతీ ప్రత్యేక అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. మంచినీటి ట్యాంకులను క్రమం తప్పకుండా నెలకు మూడుసార్లు శుభ్రం చేయాలన్నారు.

బకాయిలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు: కలెక్టర్ హెచ్చరిక

సంగారెడ్డి టౌన్ : జహీరాబాద్ ట్రైడెంట్ ఫ్యాక్టరీ చెరకు రైతులకు చెల్లించాల్సిన బకాయిలు, ఫ్యాక్టరీ ఉద్యోగుల వేతనాలను నెలాఖరులోగా చెల్లించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. చెరకు రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫ్యాక్టరీని కచ్చితంగా నడపాలని, చెరకు రైతుల బకాయిలు, కంపెనీ ఉద్యోగుల వేతనాలు చెల్లించాలని స్పష్టం చేశారు. జాప్యం చేస్తూ ఇష్టారీతిగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని, ఆస్తులన్నింటినీ జప్తు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్పీ రూపేష్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ,నిజాం షుగర్స్ రివైవల్ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ట్రైడెంట్ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం డాక్టర్ రామ్‌నాథ్,ఆర్డీఓ వెంకారెడ్డి పాల్గొన్నారు.



బుధవారం కలెక్టరేట్‌లో చెరకు రైతుల సమస్యలపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ క్రాంతి

ఖేడ్‌లో పరిశ్రమల ఏర్పాటు

- స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌కు రూ.10కోట్లు మంజూరు
- ఎస్‌డీఎఫ్ కింద మరో రూ.10కోట్లు
- జిల్లా గ్రాంట్ కింద రూ.15.06కోట్లు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి వెల్లడి

నారాయణఖేడ్: యువతకు స్కిల్‌డెవల్‌పెంట్ కోసం రూ.10కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి తెలిపారు. నారాయణఖేడ్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇందుకు సంబంధించి నాలుగెకరాల భూమిని గుర్తించామని తెలిపారు. నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.10కోట్లు, జిల్లా గ్రాంట్స్ కింద రూ.15.06 కోట్లు మంజూరుకు కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. వెనుకబడిన ప్రాంతం కావడంతో ఉపాధికల్పన కోసం ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి కోరామని, 50 నుంచి 100 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండి రోడ్డు సదుపాయం ఉంటే పరిశ్రమల క్లస్టర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. చెరువుల మరమ్మతులకు రూ.30కోట్లు, మాసాన్‌పల్లి క్రాస్‌రోడ్డు నుంచి మాసాన్‌పల్లి వరకు రోడ్డు విస్తరణకు రూ.40కోట్లు, కొత్త రోడ్లకు రూ.22 కోట్లు, అంగన్‌వాడీ భవనాలకు రూ.3.20కోట్లతో ప్రతిపాదనలు పంపామని ఎమ్మెల్యే వివరించారు. గత ప్రభుత్వం మూడేళ్లుగా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని అన్నారు. తాను విడతల వారీగా బిల్లులు మొత్తాన్ని చెల్లించేలా అన్ని విధాలా సహకరిస్తానని హామీనివ్వడంతో 90శాతం మంది కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. త్వరలో పదెకరాల వరకు రైతుబంధు నిధులు ఖాతాల్లో జమ అవుతాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజిరెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశం, నాయకులు రమేష్ చౌహాన్, పండరిరెడ్డి, రాజు, కిషన్‌నాయక్, అమృత్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

మానసిక ఉల్లాసం, శరీర దారుఢ్యానికి క్రీడలు దోహద పడతాయని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ఖేడ్ తహశీల్ గ్రౌండ్‌లో బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రమేష్ చౌహాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కొంత సేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి వ్యాయామంతోపాటు నచ్చిన క్రీడలు ఆడాలని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ఎస్పీ అవగాహన

మునిపల్లి(అందోల్): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎస్పీ రూపేష్ అన్నారు. మండల పరిధిలోని కంకోల్ శివారు టోల్ ప్లాజా సమీపంలో ఎల్‌అండ్‌టీ సంస్థ ఆధ్వర్యంలో 35వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురక్షితంగా ప్రయాణించి గమ్య స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ గులాబీ పువ్వులను అందజేశారు. కార్యక్రమంలో డెక్కన్ ప్రాజెక్టు హెడ్ రాజేష్ విచారే, మేనేజర్ విజేందర్‌రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ రమేశ్‌కుమార్, కొండాపూర్ సీఐ చంద్రయ్య, మునిపల్లి ఎస్ఐ సురేష్, టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.



వాహనదారుడికి పువ్వు అందజేస్తున్న ఎస్పీ రూపేష్

సైబర్ నేరాలపై అప్రమత్తం

- సైబర్ క్రైమ్ డీఎస్పీ రఘు

సంగారెడ్డి అర్బన్: సైబర్ నేరగాళ్ల ఆగడాలు రోజురోజుకు మితిమీరి పోతున్నాయని, వారి బారి నుంచి తప్పించుకోవాలంటే అవగాహన ఒక్కటే మార్గమని సైబర్ క్రైమ్ డీఎస్పీ రఘు అన్నారు. బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, తమ కుటుంబ సభ్యులను అప్రమత్తం చేయాలని సూచించారు, అత్యాశకు పోయి సైబర్ నేరాల బారిన పడవద్దని సూచించారు . ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని డబ్బులు ఫ్రీగా వస్తున్నాయంటే దాని వెనుక ఏదో మోసపూరిత కుట్ర దాగి ఉందని గుర్తించాలన్నారు, సైబర్ నేరాలకు గురైనట్లయితే వెంటనే 1930 కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రవి, సంగారెడ్డి పట్టణ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ రఘు

అప్‌గ్రేడ్ దారిలో.. !

జహీరాబాద్-బీదర్ రోడ్డు అప్‌గ్రేడ్‌పై మళ్లీ ఆశలు చిగురించాయి. 154 కి.మీ రోడ్డుకు అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని మంత్రి కోమటిరెడ్డి కేంద్రానికి వినతిపత్రం సమర్పించారు. 15 రోడ్లలో మొదటి ప్రాధాన్యతగా ఆరు రోడ్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వాటిలో జహీరాబాద్-బీదర్ రహదారి మొదటి ప్రాధాన్యతలో ఉంది. దీంతో తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది.

- తెరపైకి జహీరాబాద్-బీదర్ రోడ్డు అప్‌గ్రేడ్
- కేంద్రానికి మంత్రి కోమటిరెడ్డి వినతి

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్-బీదర్ రోడ్డును రహదారిగా గుర్తించి అప్‌గ్రేడ్ చేయాలన్న విషయం మరోసారి తెరపైకి వచ్చింది. సమీప రాష్ట్రాలను కలిపే ముఖ్యమైన 15 రహదారులను గుర్తించి వాటిని జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. ఈ నెల ఒకటో తేదీన ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి వినతి పత్రం సమర్పించారు. 15 రోడ్లలో మొదటి ప్రాధాన్యతగా ఆరు రోడ్లను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఆరు రోడ్లలో జహీరాబాద్-బీదర్ రహదారి కూడా మొదటి ప్రాధాన్యతలో ఉంది. దీంతో తొమ్మిదేళ్ల నిరీక్షణకు తెరపడనుంది. కొన్ని సంవత్సరాలుగా ఊసేలేని ఈ అంశం మరోసారి చర్చకు రావడంతో రోడ్డు విస్తీర్ణంపై స్థానిక ప్రజలు ఆశలు చిగురిస్తున్నాయి. కర్నాటక రాష్ట్రంలోని బీదర్, బాల్కి, ఉద్గీర్, మహారాష్ట్రంలోని ఉద్గీర్ పట్టణ ప్రజలు హైదరాబాద్‌కు జహీరాబాద్-బీదర్ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డులో ఎక్కువ భాగం తెలంగాణ రాష్ట్రంలోనే ఉంది. గతంలో ఈ రోడ్డు ఆర్అండ్‌బీ శాఖ పరిధిలో ఉండగా.. దెబ్బతిన్న ప్రతిసారి వెంటనే మరమ్మతులు చేయించేవారు. నేషనల్ హైవే అథార్టీ అధికారులు పట్టించుకోని కారణంగా జహీరాబాద్-బీదర్ రహదారి అధ్వానంగా తయారైంది. గుంతలు పడి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు చనిపోయారు.

నేషనల్ హైవే అథార్టీకి బదలాయింపు

జహీరాబాద్-బీదర్ రోడ్డు ఇరుకుగా ఉండి వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. రోడ్డు మధ్యలో వంతెనలు, రైల్వే గేటు కూడా ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ ఉన్న రోడ్డులో నిత్యం రద్దీని దృష్టిలో ఉంచుకుని జాతీయ రహదారిగా గుర్తించారు. ఫోర్‌లేన్‌గా విస్తరించేందుకు తొమ్మిదేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపగా కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. రోడ్డుకు జాతీయరహదారిగా గుర్తించి ఫోర్‌లేన్‌గా విస్తరించేందుకు కేంద్రం ప్రభుత్వం అంగీకారం తెలిపింది. వెంటనే ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని ఈ రోడ్డును నేషనల్ హైవే అథార్టీకి బదలాయించారు. సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డుకు జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయకపోవడంతో విస్తీర్ణం పనుల్లో జాప్యం జరుగుతుంది. వికారాబాద్-తాండూర్, జహీరాబాద్-బీదర్ వరకు గల 154 కి.మీ రోడ్డుకు కేంద్రం అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి చేయాలని, తాజాగా మంత్రి కోమటిరెడ్డి వినతిపత్రం ఇవ్వడంతో ప్రజలు ఆశలు చిగురించాయి.



జహీరాబాద్-బీదర్ రహదారి

మరమ్మతులు చేయించాం

జహీరాబాద్-బీదర్ రహదారి తమ పరిధిలో లేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలోనే ఈ రోడ్డును ఎన్‌హెచ్ఏ వారికి బదలాయించాం. రోడ్డు మరమ్మతుల గురించి వారే చూసుకోవాలి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గత సంవత్సరం దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయించాం.

–నర్సింలు, డీఈఈ, ఆర్అండ్‌బీ,జహీరాబాద్

న్యూస్‌రీల్

పుణ్య స్నానాలకు ఏర్పాట్లు పూర్తి

నారాయణఖేడ్: మాఘ అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 9న మనూరు మండల పరిధిలోని బోరంచ వద్ద మంజీరానదిలో పుణ్య స్నానాలను ఆచరించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు బోరంచ సంగమేశ్వర కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 4గంటల నుంచి 12గంటల వరకు పవిత్ర స్నానాలను ఆచరించి సంగమేశ్వరుడి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వాహకులు సూచించారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



బుదేరా గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

మునిపల్లి(అందోల్): పరిసరాల శుభ్రత.. అందరి బాధ్యత అని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాలను పురస్కరించుకొని మండల పరిధిలోని బుదేరా, తాటిపల్లి, మేళసంగ్యం, చిన్నచల్మెడలో పారిశుద్ధ్య నిర్వహణపై బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుదేరాలో సీఈఓ మాట్లాడుతూ ఇళ్ల సమీపంలో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలను తొలగించుకోవాలన్నారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఖమ్మంపల్లిలో తహసీల్దార్ తెన్‌మొళి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటిపల్లి రాంరెడ్డి, మండల వ్యవసాయాధికారి శివకుమార్, బుదేరా సర్పంచ్ గౌరమ్మ, తహసీల్దార్ తెన్‌మొళి, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి పాల్గొన్నారు.

బస్సురూట్‌లపై సర్వే



బస్సు రూట్‌పై సర్వే చేస్తున్న ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, అధికారులు

మనూరు(నారాయణఖేడ్): నాగల్‌గిద్ద మండల పరిధిలోని సరిహద్దు గ్రామాలైన గౌడ్‌గాం జన్‌వాడ, ఔదత్‌పూర్, ఎస్గీ, కారాముంగి గ్రామాల్లో బుధవారం నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య మార్కెటింగ్ అధికారి పాండుతో కలసి బస్ రూట్‌లపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామాల రూట్‌మ్యాప్‌లను సిద్ధం చేశామని తెలిపారు. త్వరలోనే ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని వివరించారు. డీఎం వెంట ఎంపీటీసీ సంతోష్, నాయకులు అనిల్‌పాటిల్, గుండేరావు, నెహ్రూ ఉన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీఈఓ వందన

జోగిపేట(అందోల్): నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి వందన అన్నారు. జోగిపేటలోని స్వర్ణకారుల సంఘం భవనంలో నిరుద్యోగులకు సంకల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. వర్క్‌షాపు శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు, కిట్లు అందజేశారు. కార్యక్రమంలో అందోల్–జోగిపేట మున్సిపల్ కమిషనర్ తిరుపతి, ఏపీసీసీ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దుర్గారెడ్డి, శిక్షకులు రామ్‌రాయులు, బిక్షపతి పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

నారాయణఖేడ్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆర్డీఓ వెంకటేష్ వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మృతుల పేర్ల తొలగింపు, ఓటరు జాబితా ప్రచురణ తదితర విషయాలపై చర్చించారు. నిజాంపేట్–నారాయణఖేడ్–బీదర్ జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులతో డీఎస్టీ తండా, జూకల్, పిప్రి గ్రామాల్లో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ దేవదాస్, పంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు హరీశ్‌రావు పరామర్శ



వెంకట్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుంటున్న హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): వెంకటాపూర్ మాజీ సర్పంచ్ భర్త, బీఆర్‌ఎస్ నాయకుడు ఎల్లంకి వెంకట్‌రెడ్డిని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయనపై నాలుగు రోజుల కిందట గుర్తు తెలియని దుండగులు దాడి చేయగా అపస్మారక స్థితికి చేరుకుంటే హైదరాబాద్‌లోని ఓఆస్పత్రిలో చేర్పించడం తెలిసిందే. కాగా, ఆరోజు అర్ధరాత్రి అక్రమంగా ఇసుక అక్రమార్కులు అతని తలపై ఇనుప రాడ్డుతో బాది రోడ్డు ప్రమాదం జరిగినట్లుగా చిత్రీకరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దాడి చేసిన దుండగులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

గంజాయి విక్రేతల అరెస్టు



మాట్లాడుతున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): గంజాయి విక్రేతలను టాస్క్‌ఫోర్స్, పోలీసులు అరెస్టు చేయగా అందులో ఓ మైనర్ కూడా ఉన్నాడు. వారి నుంచి మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం మద్దూరు మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో సీఐ ఎల్.శ్రీను విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. తమకు అందిన సమాచారం మేరకు దూల్మిట్ట జగ్గన్నకుంట వద్ద అదే గ్రామానికి చెందిన చిలుక ఉదయ్‌కుమార్, బోయిని భాను, ఓ మైనర్ గంజాయిని పీలుస్తూ పలువురికి అమ్మేందుకు సిద్ధమయ్యారు. జిల్లా టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు మూకుమ్మడిగా దాడి చేసి వారి వద్ద 15 గ్రాముల గంజాయి, దాన్ని పీల్చేందుకు ఉపయోగించే పేపర్‌లు, ఇతర వస్తువులను, రెండు ఫోన్‌లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ తరలించారు. గంజాయిని పట్టుకున్న మద్దూరు పోలీసులను ఆయన అభినందించి రివార్డుల కోసం సిఫారసులు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మద్దూరు ఎస్‌ఐ షేక్ యూనూస్ అహ్మద్ అలీ ఉన్నారు.

బిల్డింగ్ పైనుంచి పడి యువతి మృతి

కొండపాక(గజ్వేల్): ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి యువతి మృతిచెందింది. ఈ సంఘటన కొండపాక మండలం దుద్దెడలో చోటుచేసుకుంది. త్రీటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. చేర్యాల మండలం శాబష్‌గూడెం గ్రామానికి చెందిన ఉల్లంపల్లి పోశవ్వ పెద్ద కూతురు కవితను కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన రమేష్‌తో వివాహం జరిపించారు. ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాల జాతర చూసేందుకు ఈనెల 5న చిన్నకూతురు శ్రీలత(25) వచ్చింది. బుధవారం అక్కబావతో కలిసి శివపార్వతుల కల్యాణోత్సవం చూసి వచ్చారు. అయితే వారు నూతనంగా నిర్మిస్తున్న ఇంటి పనుల్లో సహకరిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారిపడగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

సిరుల వరి

సింగూరు నీటితో ఏటా రెండు పంటలు

- ప్రస్తుతం పుల్‌కల్, చౌటకూరు, అందోల్ మండలాల్లో 40 వేల ఎకరాల్లో సాగు



వరి సాగు



సింగూరు కాలువ

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు సాగు నీటితో రైతులు సిరులు పండిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితమే కాలువల నిర్మాణం పూర్తయి నిరంతరాయంగా నీరు సరఫరా అవుతుండటంతో సాగు విస్తీర్ణాన్ని పెంచారు. పంట ఉత్పత్తులు కూడా పెరగడంతో ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఒకప్పుడు కరెంట్ కోసం, వర్షాల కోసం ఎదురు చూసిన వారు కాలువ నీటితో పంటలు పండిస్తున్నారు.

సింగూరు కాలువల ద్వారా ఎడమ కాలువ నుంచి సాగు నీరు సరఫరా అవుతోంది. పుల్‌కల్, చౌటకూరు, అందోల్ మండలాల రైతులు ఏటా రెండు పంటలను పండిస్తున్నారు. కాలువ పరిధిలోని చెరువులను కూడా నీటితో నింపుతున్నారు. దీంతో ఆయకట్టు రైతులు 40 వేల ఎకరాల్లో వరి చేస్తున్నారు. సంవృద్ధిగా నీరు లభిస్తుండటంతో పాటు ఉత్తర భారత దేశం నుంచి కూలీలు ఇక్కడికి వస్తున్నారు. దీంతో నాట్లు వేసే విషయమై కొరత ఉండదు. రసాయనాలను డ్రోన్‌ల సహాయంతో పిచికారీ, పంట పూర్తయిన తర్వాత వరి కోత యంత్రాలతో సులువుగా నూర్పిడి చేస్తున్నారు. అనంతరం ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా కొంటుంది. నగదును రైతుల ఖాతాలోనే సకాలంలో జమ చేస్తుండటంతో వరి సాగుకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. కాగా ఆయకట్టు పరిధిలో కొత్తగా రైసు మిల్లులు సైతం వెలిశాయి.

ఆర్థిక పరిపుష్టి సాధించారు



సింగూరు కాలువ ద్వారా సాగు నీరు సరఫరా అవుతుండటంతో రైతులు వరి విస్తీర్ణాన్ని పెంచారు. ఉత్తర భారతం నుంచి కూలీలు వస్తుండటంతో ఇక నాటు వేయడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తబోవు. యంత్రాల సహాయంతో వరి కోతలు చేస్తున్నారు. సకాలంలోనే ప్రభుత్వమే పంట కొనుగోలు చేస్తుంది. దీంతో రైతులు ఆర్థికంగా ఎదిగారు.

– లక్ష్మారెడ్డి, రైతు, పోచారం

చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఆ సమయంలో 30 మంది ప్రయాణికులు
- 23 మందికి గాయాలు, అందులో ఏడుగురికి తీవ్ర గాయాలు
- ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు
- రాళ్లకత్వ గ్రామంలో ఘటన
- అతి వేగమే ప్రమాదానికి కారణమా?



చెట్టును ఢీకొన్న ఆర్టీసీ బస్సు



గాయపడిన కండక్టర్ పోచయ్య

జిన్నారం(పటాన్‌చెరు): అతివేగానికి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో 23 మంది గాయపడ్డారు. అందులో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండలంలోని రాళ్లకత్వ గ్రామంలో బుధవారం జరిగింది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు, ప్రయాణికుల కథనం ప్రకారం.. నర్సాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఇక్కడి నుంచి ఉదయం 7 గంటలకు 30 మంది ప్రయాణికులతో పటాన్‌చెరుకు బయలుదేరింది. రాళ్లకత్వ దాటిన తర్వాత వచ్చిన ఒక మలుపు వద్ద బస్సు వేగానికి అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో 23 మందికి గాయాలయ్యాయి. అందులో డ్రైవర్ ఎరుకలి బుచ్చయ్య, కండక్టర్ పోచయ్య, ఇమాంనగర్‌కు చెందిన చిద్రుప్ప పద్మ, సోలక్‌పల్లికి చెందిన ఇంద్రేశం అక్షిత్‌గౌడ్, నల్లగండ్ల సాయి, నల్లగండ్ల సంజన, సికింద్రాబాద్‌కు చెందిన రాజమన్నోళ్ల లక్ష్మిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రికి, మరికొంత మందిని ఇంద్రేశంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. కాగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ విజయారావు తెలిపారు. క్షతగాత్రులను డీఎస్పీ పురుషోత్తంరెడ్డి, సీఐ వేణుకుమార్, ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం దైవాదీనం, డిపో మేనేజర్ మాధవి, పలువురు రాజకీయ పార్టీల నేతలు పరామర్శించారు.

బస్సు వేగంగా వెళ్తుంది

బస్సు రోజూ వేగంగా వెళ్తోంది. ఈ విషయాన్ని చాలాసార్లు ఆర్టీసీ అధికారులకు చెప్పాం. అయినా పట్టించుకోలేదు. వేగంగా బస్సు వెళ్తుండటాన్ని కళ్లారా చూశా. గ్రామాల నుంచి వెళ్తున్న సమయంలో డ్రైవర్లు వేగాన్ని తగ్గించాలి.

: మల్లేశ్, ప్రత్యక్ష సాక్షి, రాళ్లకత్వ

స్టీరింగ్ నట్టు ఊడిపోయింది

స్టీరింగ్ నట్టు ఊడిపోవటంతో బస్సు కంట్రోల్ కాలేదు. దీంతో చెట్టుకు ఢీకొంది. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. నా అభిప్రాయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తా.

: బుచ్చయ్య, డ్రైవర్

రేపటి నుంచి కూడవెల్లి జాతర



కూడవెల్లి శ్రీరామలింగేశ్వరస్వామి మూలవిరాట్



విద్యుత్ దీపాల కాంతుల్లో మెరుస్తున్న దేవాలయం

దుబ్బాకరూరల్: అక్బర్ పేట భూంపల్లి మండలంలోని కూడవెల్లి రామలింగేశ్వరాయంలో ప్రతి సంవత్సరం మాఘఅమావాస్య రోజున పెద్ద ఎత్తున జాతర జరుగుతుంది. శుక్రవారం మాఘఅమావాస్య కావడంతో ఆరోజు ఘనంగా ప్రారంభమవుతాయి. సరిహద్దు జిల్లాలైన మెదక్, సంగారెడ్డి, నిజామాబాద్, వరంగల్, రాజన్నసిరిసిల్లా జిల్లా, కరీంనగర్ జిల్లాలకు చెందిన భక్తులతోపాటు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన వారు సైతం భారీ సంఖ్యలో తరలి వస్తారు. ఐదు రోజుల వరకు ఉత్సవాలు జరుగుతాయి. కూడవెల్లికి తూర్పు దిక్కున పెద్ద వాగు, పడమర వైపు చిన్నవాగు ఉంటాయి. ఇవి ఉత్తర దిశన ప్రవహిస్తాయి. రాముడు రావణ సంహారణ చేసి తిరుగు ప్రయాణంలో శివుడిని ఆరాధించడం కోసం ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించాడని పూర్వీకులు చెబుతున్నారు. పెద్ద, చిన్న వాగులు కలిసే చోట రాముడు ఇసుక లింగాన్ని ప్రతిష్ఠించడంతో అప్పటి నుంచి ఆప్రాంతాన్ని కూడవెల్లి వాగు అని పిలుస్తున్నారు. వాగుపక్కన రామేశ్వరం పల్లి గ్రామం ఉండడం వలన కూడవెల్లి రామలింగేశ్వరాలయంగా పిలుస్తారు. జాతర ఉత్సవాలకు దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అయితే మాఘఅమావాస్య రోజున రామ చంద్రుడు వాగులో స్నాన మచారించాడు కనుక అదే రోజు భక్తులు సైతం ఆచరించి దైవ దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

అన్ని ఏర్పాట్లు చేశాం

ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వారు క్యూలైన్లో వెళ్లడానికి బారికేడ్లు ఏర్పాటు చేశాం. గుండంలో స్నానమాచరించడానికి స్నానపు గదులను సిద్ధం చేశాం. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాం. నిఘా కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ప్రత్యేకించి పోలీస్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం.

– చంద్రం ఆలయ చైర్మన్, విశ్వనాథశర్మ ఆలయ ఈఓ

ఏడాదికొకసారే దత్త దర్శనం

జాతరకు ముస్తాబైన ఆలయం

నంగునూరు(సిద్దిపేట): ప్రతి యేటా మాఘఅమావాస్య రోజున పాలమాకులలో జరిగే బండమీది జాతరకు దత్తాత్రేయుని ఆలయం ముస్తాబైంది. నాలుగు గ్రామాల శివారులో ఉన్న ఆలయాన్ని సంవత్సరానికి ఒకరోజు మాత్రమే తెరిచి సాయంత్రం మూసి వేయడం ఇక్కడి ప్రత్యేకత. ఆలయ ప్రాంగణంలో హరి నామం ఆకారంలో వెలసిన పవిత్ర గుండంలో స్నానం చేసి స్వామిని దర్శనం చేసుకుంటే మంచి జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు చీకోటి వంశస్తులు, గ్రామస్తులు తెలిపారు.



ఆలయంలో వెలసిన దత్తాత్రేయుడు

అప్పులు తీర్చే మార్గం లేక..

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



కృష్ణాగౌడ్ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రాయపోలు మండలం బేగంపేటలో చోటుచేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బయ్యారం కృష్ణాగౌడ్ (32) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రెండేళ్ల క్రితం ప్రైవేటు బ్యాంకులో లోన్ తీసుకుని ఇల్లు కట్టాడు. కిస్తీలు కట్టేందుకు సతమతమవుతున్నాడు కొంతకాలంగా దిగాలుగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తూప్రాన్‌కు వెళ్తున్నట్లు చెప్పి బయటికెళ్లి గడ్డి మందు తాగాడు. మధ్యాహ్నం ఫోన్ చేసి భార్య వర్షకు అప్పులు తీర్చే మార్గం దొరక్క జీవితంపై విరక్తితో ఈ ఘాతుకానికి పాల్పడ్డానని చెప్పాడు. వెంటనే ఇంటికి తిరిగొచ్చి వాంతులు చేసుకుంటే వెంటనే గ్రామస్తుల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్య మృతిని తట్టుకోలేక.. మద్యానికి బానిసై



నర్సింలు(ఫైల్)

గజ్వేల్‌రూరల్: ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లిలో చోటు చేసుకుంది. గజ్వేల్ ఎస్‌ఐ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం ... గ్రామానికి చెందిన జనగామ నర్సింహులు(33) భార్య ఏడాది క్రితం మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేక మానసిక వేదన గురైన అతను మద్యానికి బానిసయ్యాడు. బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్యం తాగొద్దన్నందుకు..

మనోహరాబాద్(తూప్రాన్): మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ భారతి (35) తన కుటుంబంతో కలిసి మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో అద్దె కుంటున్నాడు. ఇక్కడే ఓ పరిశ్రమలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతను మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు తాగొద్దన్నందుకు గాను మనస్తాపం చెంది బుధవారం అద్దె ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య పూజ, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

పెళ్లి కావడం లేదని తనువు చాలించాడు

నంగునూరు(సిద్దిపేట): పెళ్లి కావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. కోనాయిపల్లికి చెందిన రజినీకర్‌రెడ్డి (38) హైదరాబాద్‌లో ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా ఉద్యోగం చేస్తున్నాడు. వివాహం కావడం లేదని బాధతో మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల కిందట గ్రామానికి చేరుకున్న అతడు శివారు ప్రాంతంలోని నిమ్మ బాల్‌రెడ్డి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అందులో మృతదేహాన్ని గుర్తించిన జిడ్డి ప్రవీణ్ పోలీసులకు సమాచారం అందించారు. వారు.. గుర్తు తెలియని వ్యక్తి మృతి కేసుగా నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా అదే గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

బావిలో దిగిన ఎస్‌ఐ

మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండటంతో గ్రామస్తులు బావిలోకి దిగేందుకు ముందుకు రాలేదు. దీంతో ఎస్‌ఐ మోహన్‌రెడ్డే ముందుకొచ్చి అందులో దిగి సిబ్బంది సహాయంతో బయటకు తీశారు.

గుండెపోటుతో 8వ తరగతి విద్యార్థిని కన్నుమూత

– తడ్కపల్లిలో ఘటన



లాక్షణ్య(ఫైల్)

సిద్దిపేటఅర్బన్: ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిని గుండెపోటుతో కన్నుమూసింది. ఈ ఘటన సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలో బుధవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అంబటి మహేశ్ కూతురు లాక్షణ్య (13) సిద్దిపేటలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. మంగళవారం రాత్రి జ్వరంతో బాధపడుతుండగా తల్లిదండ్రులు మాత్ర వేస్తే మరుసటి రోజు ఉదయం వరకు తగ్గింది. అప్పుడే టిఫిన్ చేసి ఇంట్లోనే కూర్చుంది. కాసేపటికి బాత్‌రూంకు వెళ్లింది ఎంతకీ బయటికి రాకపోయే సరికి తల్లిదండ్రులు వెళ్లి చూస్తే అపస్మారక స్థితిలో కనిపించింది. వెంటనే సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే బాలిక మృతిచెందిందని, తీవ్రమైన గుండెపోటు రావడంతోనేనని తెలిపారు.

చికెన్ షాప్‌లో చోరీ

సిద్దిపేటకమాన్: చికెన్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టసాగర్‌కు చెందిన భూసాని సుధాకర్ హౌజింగ్ బోర్డు కాలనీలో చికెన్ షాపును నిర్వహిస్తున్నాడు. మాంసం అమ్మిన నగదు కౌంటర్‌లో పెట్టి బుధవారం మధ్యాహ్నం బయటకు వెళ్లి తిరిగొవచ్చి చూస్తే అందులో ఉన్న రూ.3.40 లక్షలు కనిపించలేదు దీంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తులో ఉంది.

చేపల వేటకు వెళ్లి ముగ్గురి మృతి

చేపల వేటకు వెళ్లి ముగ్గురు మృతిచెందారు. పర్కిబండలో ఇద్దరు, పొలంపల్లిలో మరొకరు విగతజీవులుగా కనిపించారు.



బుర్రి యాదయ్య (ఫైల్)



లక్ష్మణ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): చేపల వేటకు వెళ్లిన ఇద్దరు చెరువులో మృతిచెందారు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బుధవారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పర్కిబండ గ్రామానికి చెందిన బుర్రి యాదయ్య (58), ఎండీ యాసిన్‌ఖాన్(60) మంగళవారం సాయంత్రం గ్రామ కుడి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. కాగా రాత్రి అయినా ఇంటికి తిరిగి రాలేదు. అనుమానం వచ్చి కుటుంబీకులు, గ్రామస్తులు అక్కడికి వెళ్లి చూస్తే ఈ ప్రాంతంలో విడిచిన దుస్తులు కనిపించాయి. అలాగే గ్రామానికి చెందిన బుర్రి గణేష్, బుర్రి భిక్షపతి చెరువులోకి దిగి గల్లంతైన మృతదేహాల కోసం గాలించగా రాత్రి లభ్యమయ్యాయి. యాసిన్‌ఖాన్ కుమారుడు ఎండీ గౌస్‌ఖాన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.

చేగుంటలో... మరొకరు

చేగుంట(తూప్రాన్): చేపల వేటకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని పొలంపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాట లక్ష్మణ్(25) మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని ఆచూకీ కోసం స్థానికులు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. బుధవారం సాయంత్రం గ్రామ శివారు తుర్కల చెరువు సమీపంలో చెప్పులు, దుస్తులు కనిపించాయి. దీంతో కుటుంబీకులు ఈతగాళ్లను రప్పించి చెరువులో వెతకగా మృతదేహం బయటపడింది. చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.



పూదోటలా.. కొత్తిమీర పూత

ఈ చిత్రంలో కనిపిస్తున్నది పూదోట అనుకుంటే పొరపాటు పడినట్లే. గ్రామాల్లో పత్తి పంట అనంతరం నీటి లభ్యత ఉన్న రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అందులో భాగంగానే మండల పరిధిలోని బోరేగావ్ గ్రామ శివారులో ఓ రైతు కొత్తిమీర సాగు చేపట్టాడు. ప్రస్తుతం పూత కాయడంతో పూదోటలా కనిపించి అందరినీ ఆకట్టుకుంటోంది.

– ఝరాసంగం(జహీరాబాద్)

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట మోసం

రూ.19.90 లక్షలు పోగొట్టుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి బురిడీ వేసి వారు భారీగా నగదు కాజేశారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నాగరాజు కథనం ప్రకారం... పీజేఆర్ ఎంక్లేవ్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి జనవరి 4న ట్రేడింగ్ కు సంబంధించిన మెసేజ్ వచ్చింది. లింకు ఓపెన్ చేసి తన వివరాలను నమోదు చేశాడు. దీంతో అపరిచిత ట్రేడింగ్ నిర్వాహకులు ఐడీని క్రియేట్ చేసి ఇచ్చారు. అతను నగదును ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్ చేస్తూ వచ్చాడు. పెట్టిన పెట్టుబడి, కమిషన్ చూపిస్తూ వచ్చారు. మొత్తంగా రూ.19 లక్షల 90 వేలు ఇన్వెస్ట్ చేశాడు. తాను పెట్టిన నగదు, యాప్‌లో చూపిస్తున్న రూ.80 లక్షలు ఇవ్వాలని అడగగా ఆగంతకులు స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైం, అమీన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



అర్చకుడికి సైతం...

కొరియర్ పేరిట సైబర్ కేటుగాటు .. వ్యక్తికి టోకరా వేసిన ఘటన అమీన్‌పూర్ స్టేషన్ పరిధిలో జరిగింది. నరేంద్రనగర్ కాలనీకి చెందిన ఓ అర్చకుడికి.. జనవరి 13న కొరియర్ వచ్చిందని ఆగంతకుడు కాల్ చేశాడు. ఇందులో అడ్రస్ తప్పుగా ఉంది ఒక్క పది రూపాయలు పంపితే సరి చేస్తానని అందుకు లింకు పంపిస్తానన్నాడు. లింకును ఓపెన్ చేసి నగదు చెల్లిస్తున్న క్రమంలో ఖాతాలో ఉన్న రూ.99 వేలు డెబిట్ అయ్యిందని మెసేజ్‌వచ్చింది. కంగారు పడిన బాధితుడు సైబర్ క్రైం, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.